
సాక్షి
ఒడిశా

శనివారం । 1 । మార్చి । 2025



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు
నగదు : రూ. 5,55,292
బంగారం : 150 మిల్లీ గ్రాములు
వెండి : 46 గ్రాముల 400 మిల్లీ గ్రాములు
- భువనేశ్వర్/పూరీ



టీబీ నిర్మూలనకు సిద్ధం

టీబీ నిర్మూలిస్తామని కేంద్ర మంత్రి నడ్డా అన్నారు. నిర్దేశిత సమయం కంటే ముందే అది జరుగుతుందన్నారు. - IIలో▸



ఉత్తమ్ అంత్యక్రియలు

ప్రముఖ నటుడు ఉత్తమ్ మహంతి అంత్యక్రియలు జరిగాయి. ప్రభుత్వ లాంఛనాలతో జరిగాయి. - IIలో▸

న్యూస్‌రీల్

బీజేపీలోకి రబీ గొమాంగో



గొమాంగోకు స్వాగతం పలుకుతున్న మంత్రి బిభూతి

రాయగడ: జిల్లాలోని రామనగుడ సమితి చైర్మన్ రబీ గొమాంగో బీజేపీలో చేరారు. స్థానిక బిజూ పట్నాయక్ ఆడిటోరియంలో ఒక కార్యక్రమానికి హాజరైన మంత్రి బిభూతి భూషన్ జెన్న సమక్షంలో బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. గత పంచాయతీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన గొమాంగో రామనగుడ సమితి చైర్మన్‌గా ఎన్నికయ్యాడు. అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరినా, తనకు సముచిత స్థానం కల్పించడం లేదని ఆ పార్టీకి గుడ్ బై చెప్పారు. మంత్రి బిభూతి జెన్న ఆయనను సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎం.గోపి ఆనంద్, పార్టీ ఎస్సీ, ఎస్టీ సెల్ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు కాశీరాం మాఝి, సీనియర్ నాయకుడు శివకుమార్ పట్నాయక్, బసంత ఉలక పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 626 మంది ఎంపిక



ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేస్తున్న కలెక్టర్ దాస్, ఎమ్మెల్యే గోమాంగో

పర్లాకిమిడి: గజపతి జిల్లా రాయగడ బ్లాక్ చంపాపూర్ మినీ స్టేడియం వద్ద శుక్రవారం జిల్లా స్థాయిలో జాబ్‌మేళాను జిల్లా అధికార యంత్రాంగం, స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా ఉపాధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ జాబ్ మేళాకు ముఖ్యఅతిథిగా మోహన ఎమ్మెల్యే దాశరథి గోమాంగో హాజరై ప్రారంభోత్సవం చేశారు. రాయగడ పంచాయతీ సమితి ఉపాధ్యక్షులు జ్యోతి ప్రసాద్ పాణి, గ్రామీణ స్వయం ఉపాధి కేంద్రం డైరెక్టర్ శ్రావణ్ కుమార్, జిల్లా పరిశ్రమల అధికారి సునారాం సింగ్, తహసీల్దార్ సుకాంతి ప్రధాన్ ప్రముఖులు పాల్గొన్నారు. జిల్లాలోని ఏడు సమితి కేంద్రాల నుంచి 746 మంది యువతీ యువకులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోగా 626 మందిని వివిధ కంపెనీల ప్రతినిధులు ట్రైనింగ్, ఉపాధి అవకాశాలకు ఎంపిక చేశారు. ఈ జాబ్ మేళాలో 40 ప్రైవేటు కంపెనీలు పాల్గొన్నాయి. ఎంపికైన వారికి కలెక్టర్ బిజయ కుమార్ దాస్, ఎమ్మెల్యే (మోహనా) దాశరథి గోమాంగో చేతుల మీదుగా ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. ఈ జాబ్ మేళాకు జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్, ఉపాధి అధికారి సౌభాగ్య స్మృతి రంజన్ త్రిపాఠి అధ్యక్షత వహించి మాట్లాడగా, స్కిల్ డెవలప్‌మెంట్, ఉపాధి అధికారి శిభాషిస్ సాహుతో అనేక మంది ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

గంజాయితో ఒకరు అరెస్టు

మల్కన్‌గిరి: జిల్లాలోని బలిమెల పోలీసులు బుధవారం రాత్రి గంజాయితో ఒకరిని అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. సార్లుకొండ - బేజాంగ్‌వాడ ప్రధాన రహదారిలో బండిగూడ కూడలి వద్ద పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించారు. ఆ సమయంలో ఒక వ్యక్తి ఒక బస్తాను బస్సులో తరలించేందుకు రావడం గమనించారు. దీంతో అనుమానం వచ్చి అతడిని ఆపి ప్రశ్నించారు. అనంతరం బస్తాను తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది. వెంటనే అతడిని అరెస్టు చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు బాంగ్లముండ గ్రామానికి చెందిన శుక్ర హంతాల్‌గా నిర్ధారించారు. గంజాయిని ఆంధ్రాకు తరలిస్తున్నట్లు తెలిపాడు. గంజాయిని తూకం వేయగా మొత్తం 21 కేజీలు ఉంది.

మూలధన వ్యయమే కీలకం: సీఎం



ముఖ్యమంత్రి అధ్యక్షతన బడ్జెటు నిధుల కేటాయింపు వ్యయం సమీక్ష సమావేశం

భువనేశ్వర్: సకాలంలో బడ్జెట్‌లో కేటాయింపు నిధుల్ని వెచ్చించడం అభివృద్ధికి దోహదం చేస్తుందని ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి అన్నారు. వివిధ శాఖలకు బడ్జెట్‌లో కేటాయించిన నిధుల వ్యయాలను ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ స్థానిక లోక్ సేవా భవన్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024-2025 చివరి నాటికి సమగ్ర వ్యయ పరిమాణం 85 శాతం కావాలని ముఖ్యమంత్రి సూచించారు. గత 2023-24 ఆర్థిక సంవత్సరంలో మొత్తం బడ్జెట్‌లో 81 శాతం నిధులు వెచ్చించినట్లు తెలిపారు. పలు ప్రజాహిత, అభివృద్ధి కార్యక్రమాల కోసం బడ్జెటులో కేటాయించిన మూల ధన వ్యయం అత్యంత కీలకమైనదని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. నిర్ధారిత కాల పరిమితిలో కేటాయించిన నిధుల్ని కేటాయించడం ద్వారా ఉపాధి వనరుల ఆవిష్కరణ సుగమం అవుతుందని, దీంతో వృద్ధిని పెంపొందింప జేస్తుందని వివరించారు. అన్ని శాఖల మంత్రులు వెంటనే అనుబంధ వ్యయ ప్రతిపాదనలను అధ్యయనం చేసి అవసరమైన అనుమతులు జారీ చేయాలని తెలిపారు. వివిధ సంక్షేమ పథకాల్లో పెండింగ్‌లో ఉన్న చెల్లింపులన్నింటినీ నిబంధనల ప్రకారం వెంటనే చెల్లించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

2023-24 ఆర్థిక సంవత్సరంలో మొత్తం వ్యయం 81 శాతం కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2024-25) మరో 85 శాతం ఖర్చు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. రాష్ట్రంలో తొలి సారిగా పాలన పగ్గాలు చేపట్టడంతో మధ్యంతర బడ్జెటు ప్రణాళికలు వగైరా వ్యవహారాలతో బడ్జెటు నిధుల వినియోగం ఒకింత మందగించిందని, మిగిలిన ఒక్క నెలలో వ్యయం సంతృప్తికరంగా నిర్వహిస్తే లోటు సర్దుకుంటుందని, ఈ నేపథ్యంలో ఆర్థిక సంవత్సరం చివరి సరికి బడ్జెట్ నిధుల్లో 85 శాతం ఖర్చు చేయాలని ముఖ్యమంత్రి కోరారు.

ఈ లక్ష్య సాధన కోసం మంత్రులకు సలహా ఇస్తూ వ్యయ ప్రతిపాదనలన్నింటినీ శాఖాపరమైన మంత్రులు పరిశీలించి వెంటనే ఆమోదించాలని ముఖ్యమంత్రి సూచించారు. వివిధ సంక్షేమ పథకాల కింద బకాయి చెల్లింపుల్ని నిబంధనల ప్రకారం వెంటనే చెల్లించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రాష్ట్రం స్థూల దేశీయ ఉత్పత్తి (జీఎస్‌డీపీ)లో 6.1 శాతం మూలధన వ్యయాన్ని కేటాయించి జాతీయ స్థాయిలో అత్యధిక జీఎస్‌డీపీ వ్యయ ప్రణాళికగా గుర్తింపు సాధించడం విశేషం. వ్యవసాయ ఆర్థిక వ్యవస్థతో పాటు ఇతర రంగాల్లో ఆర్థిక కార్యకలాపాలను పెంచడం ప్రభుత్వ లక్ష్యం. దీని కోసం మౌలిక సదుపాయాల విస్తృత అభివృద్ధి కోసం కృషి చేయాల్సి ఉందని వివరించారు. ఈ రంగంలో భారీ పెట్టుబడులకు ప్రభుత్వం ప్రాధాన్యత కల్పిస్తుందన్నారు.

ప్రజల కోసం బడ్జెటు

రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రజల కోసం బడ్జెట్‌ను సంకల్పించిందని, ఈ బడ్జెట్‌లో కేటాయించిన ప్రతి పైసాని సద్వినియోగపరిచిన నాడు అటు ప్రజలు, ఇటు ప్రభుత్వానికి ప్రయోజనం చేకూరి ప్రజా ప్రభుత్వంగా ఉనికిని బలపరచు కోవడం సాధ్యం అవుతుందన్నారు. ఈ సాఫల్యత కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. వ్యవసాయం, మత్స్య, జంతు వనరులు, ఆరోగ్యం, జలవనరులు, నిర్మాణం, దివ్యాంగుల సాధికారిత, సామాజిక న్యాయ శాఖ, సరఫరా, సహకార శాఖల బడ్జెటు కేటాయింపుల వ్యయం పాక్షికంగా సంతృప్తికరంగా ఉన్నట్లు విశ్లేషించారు. ఇతర శాఖలు నిధుల వ్యయం పట్ల దృష్టి సారించాలని ముఖ్యమంత్రి ప్రోత్సహించారు.

ఈ సమీక్ష సమావేశంలో పంచాయతీ రాజ్, తాగు నీరు, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి రవి నారాయణ్ నాయక్, గృహ నిర్మాణం, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టరు కృష్ణచంద్ర మహాపాత్రో, పాఠశాలలు, సామూహిక విద్య, షెడ్యూల్డ్ తెగలు, షెడ్యూల్డ్ తెగల అభివృద్ధి, దివ్యాంగుల సాధికారత శాఖల మంత్రి నిత్యానంద గోండ్, రవాణా, వాణిజ్య శాఖ మంత్రి బిభూతి భూషణ్ జెనా, మత్స్య, పశు సంపద శాఖ మంత్రి గోకులానంద మల్లిక్ పాల్గొన్నారు. వీరితో ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్ ఆహుజా, అభివృద్ధి కమీషనర్ అనూ గర్గ్, ముఖ్యమంత్రి అదనపు ప్రముఖ కార్యదర్శి నికుంజ్ బిహారీ ధొలా మరియు పలు శాఖల అదనపు ప్రముఖ కార్యదర్శులు తదితర ఉన్నత స్థాయి కార్యదర్శులు పాల్గొన్నారు. ఆర్థిక శాఖ ప్రముఖ కార్యదర్శి శాశ్వత్ మిశ్రా వివిధ శాఖల ఖర్చులకు సంబంధించిన వివరాల్ని సమావేశంలో ప్రవేశ పెట్టారు.

• ఘనంగా దర్జీల దినోత్సవం



కృష్ణచంద్రగజపతి నారాయణ దేవ్‌కు పుష్పాంజలి ఘటిస్తున్న టైలర్ల సంఘు ప్రతినిధులు

పర్లాకిమిడి: పర్లాకిమిడి పట్టణం మార్కెట్‌లోని టైలర్స్ వీధి వద్ద దర్జీలంతా కలిసి ప్రపంచ దర్జీల దినోత్సవాన్ని శుక్రవారం జరుపుకున్నారు. ఈసందర్భంగా పాతబస్టాండు వరకూ ర్యాలీ చేశారు. తొలుత కుట్టుమిషన్ కనిపెట్టిన విలయం ఎలియాస్ హోవే జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పాతబస్టాండు వద్ద స్వర్గీయ క్రిష్ణచంద్ర గజపతి మహారాజా విగ్రహానికి కూడా టైలర్లు పూల మాలలు వేశారు. అనంతరం గజపతి జిల్లా దర్జీల సంఘం అధ్యక్షులు కె.వరదరాజులు మాట్లాడుతూ.. రడీమేడ్ దుస్తులు మార్కెట్‌లోకి రావడంతో టైలరింగ్ వృతి భారంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు దర్జీల కుటుంబాలను ఆదుకోవాలని, పింఛన్ అందించాలని కోరారు. ర్యాలీలో దర్జీల సంఘం కార్యదర్శి పూడి దిలీప్ కుమార్, కోశాధికారి ఎం.రవిరాజ్, మల్లా ధర్మారావు, దీపక్ పాత్రో, శివాజీ పాల్గొన్నారు.

రేషన్ లబ్ధిదారులకు ఈకేవైసీ తప్పనిసరి



డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ శోశ్యారెడ్డి

• జయపురం సబ్‌కలెక్టర్ శోశ్యారెడ్డి

జయపురం: రేషన్‌కార్డు లబ్ధిదారులు కచ్చితంగా ఈకేవైసీ చేయించుకోవాలని జయపురం సబ్‌కలెక్టర్ కుమారి ఎ.శోశ్యారెడ్డి స్పష్టం చేశారు. స్థానిక మున్సిపాలిటీ కౌన్సిల్ మందిరంలో శుక్రవారం జరిగిన రేషన్ డీలర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈకేవైసీ చేయించుకోని లబ్ధిదారులకు రేషన్ నిలిపివేయాల్సి ఉంటుందన్నారు. అలా జరగకుండా ప్రతి రేషన్‌కార్డు లబ్ధిదారుడు విధిగా ఈకేవైసీ చేయించుకునేలా చూడాలని డీలర్లకు సూచించారు. డిపోలలో బియ్యం తీసుకునేందుకు వచ్చే లబ్ధిదారులు ఈకేవైసీ చేసుకున్నారో లేదో చూసుకోవాల్సిన బాధ్యత డీలర్లపై ఉందన్నారు. ఈకేవైసీ చేయించుకోని వారిని గుర్తించాలని మున్సిపల్ కార్యనిర్వాహక అధికారి, మున్సిపల్ కౌన్సిలర్లను ఆదేశించారు. సమావేశంలో పాల్గొన్న 30 మంది డీలర్ల పరిధిలో ఉన్న లబ్ధిదారుల్లో పది రేషన్ డిపోల పరిధిలోని రేషన్‌కార్డుదారులు శతశాతం ఈకేవైసీ చేయించుకున్నారని.. మిగతా 20 మంది డీలర్ల పరిధిలోని లబ్ధిదారుల్లో 80 శాతం చేయించుకున్నట్టు తెలిపారు. మిగతా 20 శాతం మంది ఇంకా ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉందన్నారు. మార్చి 31వ తేదీలోగా మిగిలిన వారంతా ఈ ప్రక్రియను పూర్తి చేసుకునేలా డీలర్లు శ్రద్ధ తీసుకోవాలని సబ్‌కలెక్టర్ ఆదేశించారు.

‘జగన్నాథ్ సాగర్ పునరుద్ధరణ వెంటనే జరగాలి’



జగన్నాథ్ సాగర్ పునరుద్ధరణ డిమాండ్‌తో నిర్వహించిన ర్యాలీ

జయపురం: చారిత్రక జయపురం జగన్నాథ్ సాగర్ పునరుద్ధరణ పనులు వెంటనే చేపట్టి పూర్తి చేయాలని శుక్రవారం ‘మో జగన్నాథ్ సాగర్ ట్రస్టు, జగన్నాథ్ సాగర్ సంఘర్ష్ కమిటీలు సంయుక్తంగా ఆందోళన చేపట్టాయి. ఉదయం 9 గంటలకు స్థానిక రథొపాడియ రఘునాథ్ మందిర కూడలి నుంచి వందలాది మంది సేవ్ జగన్నాథ్ సాగర్ ప్లకార్డులు చేత పట్టి నినాదాలు చేస్తూ పట్టణ ప్రధాన మార్గంలో ర్యాలీగా బయల్దేరి 26వ జాతీయ రహదారి బస్టాండ్ జంక్షన్ వద్ద ధర్నా చేశారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించిన ధర్నా ప్రశాంతంగా జరిగింది. ఈ ధర్నాలో ట్రస్ట్ నేతలు ప్రసంగిస్తూ జగన్నాథ్ సాగర్ జయపురం మహారాజుల కాలంలో తవ్వించిందని, పాలకుల నిర్లక్ష్యం కారణంగా సాగర్ ఆక్రమణలకు లోనై శిథిలావస్థకు చేరుకుందని తెలిపారు. సాగర్ పునరుద్ధరణ, అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం రూ.14.84 లక్షలు మంజూరు చేసేందుకు హామీ ఇచ్చిందని, కానీ సాధారణ ఎన్నికలు ప్రారంభం కావడంతో జయపురం మున్సిపాలిటీ తన సొంత నిధులతో పనులు ప్రారంభించినా ఆగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్నాథ్ సాగర్‌పై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారులు నేడు జీవనాధారం కోల్పోయారని ఆరోపించారు. ఆగిపోయిన పనులు వెంటనే పునరుద్ధరణ చేయాలన్నారు. ధర్నాలో జగన్నాథ సాగర్ ట్రస్ట్, జగన్నాథ్ సాగర్ సంఘర్ష కమిటీ నేతలు, కార్యకర్తలు హరప్రసాద్ మిశ్ర, సుభాష్ రౌత్, లలిత అగర్వాల్, హిమాంశు మహాపాత్రొ, నిరంజన్ పాణిగ్రహి, అనిల్ కుమార్ బెహర, సహదేవ పట్నాయిక్, రాజా పాఢి, రజణీకాంత నాయిక్, అరుకుల శ్రీను, ట్వింకిల్ మిశ్ర తదితరులు పాల్గొన్నారు.

• ఘనంగా సైన్స్ డే



జాతీయ విజ్ఞాన దినోత్సవంలో మాట్లాడుతున్న జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ రవికుమార్



జాజిపూర్ గ్రామంలో విజ్ఞాన దినోత్సవంలో అతిథులు



జాతీయ విజ్ఞాన ప్రదర్శనలో ప్రాజెక్టులు

పర్లాకిమిడి: గుసాని సమితి జాజిపూర్ గ్రామంలో ప్రభుత్వ ఉన్నత ప్రాథమిక పాఠశాలలో సైన్స్ డే సందర్భంగా విజ్ఞాన, గణితం క్లబ్ ప్రదర్శనను రాష్ట్రపతి అవార్డు గ్రహీత, విశ్రాంత ఉపాధ్యాయులు బినోద్ చంద్ర జెన్నా ప్రారంభించారు. ఈ విజ్ఞాణ, గణిత క్లబ్‌లో సేంద్రియ వ్యవసాయం, కలుషిత వాతావరణం, నిత్యజీవితంలో ఉపయోగపడే ఉపకరణాలు, ఎల్‌ఈడీ, డిజిటల్ వస్తువుల ఉపయోగంపై అనేక ప్రాజెక్టులు ప్రదర్శించారు. ముఖ్య అతిథి జిల్లా సైన్సు కోఆర్డినేటరు అంపోలు రవికుమార్ మాట్లాడుతూ, భవిష్యత్ టెక్నాలజీ అంతా మొబైల్, సెన్సార్స్, కృత్రిమ మేథపైనే ఆధారపడి ఉందని అన్నారు. విద్యార్థులు సైన్స్, టెక్నాలజీ, నూతన ఆవిష్కరణలుపై ఆలోచించాలని సూచించారు. గౌరవ అతిథి విశ్రాంత ఉపాధ్యాయులు బినోద్ చంద్ర జెన్నా నేటి విజ్ఞానం, గణిత శాస్త్రంపై మాట్లాడారు. సమావేశంలో ముఖ్యవక్తగా విశ్రాంత ప్రధాన ఉపాధ్యాయులు సాత్విక్ పటాన్నాయిక్ తదితరులు మాట్లాడగా, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు మోహన్ కుమార్ నాయక్ ధన్యవాదాలు తెలిపారు.

700 మందికి హోమియో వైద్య సేవలు



హోమియో వైద్య శిబిరంలో డాక్టర్ నిరంజన్ తదితరులు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ బోయిపరిగుడ సమితి రామగిరి సమీపంలోని ప్రసిద్ధ శైవ క్షేత్రం గుప్తేశ్వర్ ఆలయం వద్ద మహాశివరాత్రి ఉత్సవాల మూడు రోజులు ఏడు వందల మందికిపైగా భక్తులకు ఉచిత హోమియో వైద్య చికిత్స సేవలు అందించామని ఇంటర్ నేషనల్ హోమియోపతిక్ అసోసియేషన్ ప్రతినిధి డాక్టర్ నిరంజన్ పట్నాయక్ శుక్రవారం తెలిపారు. భక్తులకు 24 గంటల వైద్య సేవలు అందించామన్నారు. తమ అసోసియేషన్ గత 37 ఏళ్లుగా ఏటా గుప్తేశ్వర్ ఆలయం వద్ద హోమియో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ ఏడాది కూడా ఫిబ్రవరి 25వ తేదీ నుంచి మూడు రోజులు వైద్య సేవలు అందించామన్నారు. గుప్తేశ్వర్ మహా శివరాత్రి పూజాకమిటీ వారు తమకు స్టాల్ కేటాయించి సహకరించారన్నారు. శిబిరంలో అసోసియేషన్ డాక్టర్లు మధుసూదన దాస్‌చౌదరి, డాక్టర్ మహేంద్రప్రసాద్ దాస్, మనోరంజన్ మహంతి, కిశోర్ చంద్రనాయక్, ఉమాశంకర చయిన్, ధీరబ్రత పాత్రో, కనూచరణ మహంతి బృందలు రోగులకు వైద్యసేవలు అందించినట్లు వివరించారు. వైద్య శిబిరాన్ని బొయిపరిగుడ తహసీల్దార్ స్నిగ్ధ చౌదురి, దేవోత్తర విభాగ అధికారి, జయపురం తహశీల్దార్ సవ్య సాచి జెన సందర్శించి డాక్టర్లను కొనియాడారన్నారు.

దివ్యాంగుల సుస్థిర అభివృద్ధిపై సమీక్ష



సమావేశంలో పాల్గొన్న ఉన్నతాధికారులు

పర్లాకిమిడి: స్థానిక జిల్లా పరిషత్ కాన్ఫరెన్స్‌హాల్‌లో జిల్లా స్థాయి దివ్యాంగుల సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై సమీక్షా సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆదనపు సీడీఎం పృద్వీరాజ్ మండల్, జిల్లా సామాజిక సురక్షా అధికారి సంతోష్ కుమార్ నాయక్, సబ్‌డివిజనల్ సామాజిక సుర్క్షా అధికారి ఉత్సర్‌గీతా బోడోరయితో, పిరమల్ ఫౌండేషన్ అధికారి దేబబ్రత ఆచార్య, ఏపీడీవో దేవేంద్ర కోరోలు హాజరయ్యారు. రాష్ట్ర దివ్యాంగుల పునరావాసకేంద్రం అధ్యక్షులు నిరంజన్ బెహారా అధ్యక్షత వహించగా, సమర్థ్ దివ్యాంగుల కేంద్రం అధ్యక్షులు సంతోష్ కుమార్ మహారాణా ముఖ్యవక్తగా పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా 3,400 మంది దివ్యాంగులు ఉన్నారని అధికారులు వెల్లడించారు. వారికి ఇళ్ల పట్టాలు, హియరింగ్ ఎయిడ్ ఉపకరణాలు, ఉచిత విద్య, ఉపాధి కల్పించడానికి వివిధ ప్రభుత్వ శాఖల అధికారుల సహకారంతో లక్ష్యాలు సాధించగలమని దివ్యాంగుడు సంతోష కుమార్ మహారాణా అన్నారు. 2025 వికసిత్ భారత్ లక్ష్యంగా అభివృద్ధి చెందుతున్న భారత్‌లో 17 లక్ష్యాలు ఉన్నాయని వాటిలో దివ్యాంగులకు కూడా అన్ని ప్రభుత్వ శాఖలు సహకారం అందించాలని నిరంజన్ బెహారా కోరారు. దివ్యాంగులకు అన్ని రంగాలలో సహాయ సహకారాలు అందిస్తామని డీఆర్‌డీఏ ఆదనపు పీడీ పృద్వీరాజ్ మండల్ అన్నారు. సమావేశానికి గంజాం, గజపతి జిల్లాల నుంచి దివ్యాంగుల సంఘాల సభ్యులు హాజరయ్యారు. ఈ సమావేశం సమర్థ్ దివ్యాంగుల సంస్థ, సైట్ సేవర్స్ ఆధ్వర్యంలో జరిగింది.



సబ్‌డివిజనల్ సామాజిక సురక్షా అధికారి ఉత్సర్‌గీతాను ఆహ్వానిస్తున్న దివ్యాంగురాలు



దివ్యాంగుల సమస్యలను వివరిస్తున్న సమర్థ్ సంస్థ అధ్యక్షులు సంతోష్ మహారాణా

మెడికల్ కాలేజీ ఏర్పాటు తథ్యం



బడ్జెట్‌పై ప్రసంగిస్తున్న మంత్రి బిభూతి వేదికపై కాళీరాం, గోపి ఆనంద్ తదితరులు

• మంత్రి బిభూతి జెన్న

రాయగడ: అభివృద్ధి దిశలో పయనిస్తున్న రాయగడలో మెడికల్ కాలేజీ ఏర్పాటు తథ్యమని మంత్రి బిభూతి భూషన్ జెన్న స్పష్టం చేశారు. శుక్రవారం రాయగడలో పర్యటించిన ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుందన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ మెడికల్ కళాశాలల ఏర్పాటుపై తుది నిర్ణయానికి వచ్చినట్లు వివరించారు. దీనిలో భాగంగా సుమారు పది వేల మంది కొత్త డాక్టర్లను నియమించే విషయమై ఆలోచనలు జరుగుతున్నాయన్నారు. త్వరలోనే ఈ ప్రక్రియ ప్రారంభం కానుందని పేర్కొన్నారు. నాగావళి, జంఝావతి నదీ తీరాల్లో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తామన్నారు. ప్రాకృతిక, ఖనిజ సంపదలను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అక్రమార్కులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు విస్తృతంగా చేపడుతున్నట్లు వివరించారు.

ప్రజామోదిత బడ్జెట్

ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం ప్రజామోదిత బడ్జెట్ ప్రవేశపెట్టిందని మంత్రి బిభూతి పేర్కొన్నారు. స్థానిక బిజూ పట్నాయక్ ఆడిటోరియంలో న్యాయవాదులు, విద్యావేత్తలు, వ్యాపార తదితర రంగాల నిపుణుల అభిప్రాయాలను సేకరించడంతో పాటు బడ్జెట్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని రంగాలకు సమ ప్రాధాన్యతనిస్తూ సీఎం మోహన్ చరణ్ మాఝి బడ్జెట్ ప్రవేశపెట్టారని తెలియజేశారు. వికసిత్ ఒడిశా, వికసిత్ భారత్‌ను దృష్టిలో పెట్టుకొని బడ్జెట్ కేటాయింపులు జరిగాయని పేర్కొన్నారు. అలాగే ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలను కల్పించాలనే ఉద్దేశంతో గోపాలపూర్ నుంచి రాయగడకు అనుసంధానించేవిధంగా కొత్త రైలుమార్గం ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఆమోద ముద్ర వేయడం శుభప్రదమన్నారు. రాష్ట్రంలో అన్ని సమితుల్లోనూ అధునాతన సౌకర్యాలతో కూడిన బస్టాండ్‌ల నిర్మాణాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది 27 వేల ప్రధానమంత్రి ఆవాస్ గృహాలను రాయగడ జిల్లాలో నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వివరించారు. విద్యావేత్త డీకే మహంతి, గుణుపూర్‌కు చెందిన అక్షయ కుమార్ దాస్ తదితరులు బడ్జెట్‌పై వారి అభిప్రాయాలను తెలియజేశారు. అంతకుముందు మంత్రికి వివిధ సంస్థలకు చెందిన ప్రతినిధులు సన్మానించారు.

క్లుప్తంగా

జలాశయంలో మునిగి వ్యక్తి మృతి


జలాశయంలో తేలుతున్న బాలరామ్ పాల్ మృతదేహం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ జలాశయంలో చేపల వేటకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు నీట మునిగి ప్రాణాలు కోల్పోయాడు చిత్రకొండ సమితి బొడపోదర్ పంచాయతీ గుణూపూర్ గ్రామానికి చెందిన బాలరామ్ పాల్ (50) గురువారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయలుదేరి చేపలు వేటకు చిత్రకొంత జలాశయానికి వెళ్లాడు. అయితే సాయంత్రమైనప్పటికీ తిరిగిరాకపోవడంతో కుటుంబీకులు ఆందోళన చెందారు. గ్రామ పరిసర ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఆచూకీ లేదు. కాగా శుక్రవారం ఉదయం జలాశయం వద్దకు వెళ్లి స్థానికులకు నీట తేలుతున్న మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో చిత్రకొండ ఐఐసీ ముకుందో మేల్క సంఘటనా స్థలానికి చేరుకొని బాలరామ్ పాల్ మృతదేహాన్ని బయటకు తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్రకొండ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. కేసు నమోదు చేసినట్టు పోలీసులు పేర్కొన్నారు.

చెట్టును ఢీకొని వ్యక్తి మృతి


ప్రమాద దృశ్యం

మల్కన్‌గిరి: మలక్నగిరి జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ కార్యలయం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు ప్రాణాలు కోల్పోయారు. ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టడంతో ఒకరు చనిపోగా..ఇద్దరు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పిటాగేటా గ్రామానికి చెందిన గగోన్ కుమార్ బాఘ(22) మరో ఇద్దరు బైక్‌పై మల్కన్‌గిరి వచ్చి తిరిగి బుధవారం రాత్రి ఇంటికి వెళ్తున్న సమయంలో బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. దీంతో గగోన్‌కు తల,ఛాతీపై బలమైన గాయాలు, మరో ఇద్దరికి కూడా గాయాలు కావడంతో అంబులెన్స్‌లో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా గగోన్ అప్పటికే మృతి చెందినట్టు పరీక్షించిన వైద్యులు నిర్ధారించారు. ఐఐసీ రీగాన్ కీండో ఆస్పత్రికి చేరుకొని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. బాఘ, కృష్ణక్షితి చికిత్స పొందుతున్నారు.

బీజేపీ శ్రేణుల మధ్య కొట్లాట!


ఫ్లెక్సీలో ఎంపీ బలబద్ర మజ్జి ఫొటోను చింపుతున్న కార్యకర్త

కొరాపుట్: అధికార బీజేపీ శ్రేణుల మధ్య వీధి పోరు చందాహండి సమితి బంద్‌కి దారి తీసింది. గురువారం సాయంత్రం నబరంగ్‌పూర్ జిల్లా చందాహండి సమితి కార్యాలయం అందుకు వేదికైంది. నబరంగ్‌పూర్ పార్లమెంట్ సభ్యుడు బలబద్ర మజ్జి, ఝొరిగాం ఎమ్మెల్యే నర్సింగ్ బోత్ర అనుచరులు బహిరంగంగా కొట్లాటకు దిగారు. ఒకే పార్టీకి చెందిన ఇద్దరు నేతల అనుచరుల కొట్లాటను స్థానికులు విడదీశారు. అయితే ఈ ఘటనలో ఎంఎల్ఏ అనుచరులకు తీవ్ర అవమానం జరిగిందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. దాంతో శుక్రవారం చందాహండి సమితి బంద్ కి దళిత సమాజ్ నాయకులు పిలుపు నిచ్చారు. ఈ బంద్ జరుగుతున్న సమయంలో పలు చోట్ల ఉన్న బీజేపీ ఫ్లెక్సీల్లో ఎంపీ బలబద్ర మజ్జి చిత్రపటాలను బీజేపీ కార్యకర్తలు చించి వేయడం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. క్రమశిక్షణకి మారుపేరుగా చెప్పుకొనే బీజేపీలో వర్గ పోరాటం వీధి పోరాటానికి మారడం చర్చనీయాంశంగా మారింది.

టీబీ నిర్మూలనకు భారత్ సిద్ధం

- కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా
- రాష్ట్ర ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు: మోహన్ చరణ్ మాఝి


సదస్సు జ్ఞాపిక ఆవిష్కరించిన అతిథి ప్రముఖులు


మాట్లాడుతున్న జె. పి. నడ్డా


సదస్సుని ఉద్దేశించి ప్రసంగిస్తున్న కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా

భువనేశ్వర్: ఈ ఏడాది చివరి నాటికి భారతదేశం క్షయ వ్యాధి (టీబీ) నిర్మూలన సాధ్యమయ్యే అవకాశం ఉందని, నిర్ధారిత సమయం కంటే ముందుగానే ఈ రోగం నిర్మూలన సాధ్యం అవుతుందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా తెలిపారు. ప్రపంచ లక్ష్యం కంటే ఐదేళ్ల ముందుగానే భారత దేశం క్షయ నిర్మూలనలో ముందంజలో ఉంటుందని మంత్రి ప్రకటించారు. పూరీలో శుక్రవారం జరిగిన ప్రజారోగ్య వ్యవస్థలో ఉన్నత ప్రతిరూప పద్ధతులు, ఆవిష్కరణలపై జరిగిన 9వ జాతీయ శిఖరాగ్ర సమావేశాన్ని ప్రారంభించిన సందర్భంగా కేంద్ర మంత్రి ప్రసంగించారు. రెండు రోజుల పాటు ఈ సమావేశం కొనసాగుతుంది. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు (ఎస్‌డీజీ) ప్రకారం 2030 సంవత్సరం నాటికి క్షయ నిర్మూలించాల్సి ఉంది. 2025 నాటికే ఈ లక్ష్యాన్ని ఛేదించాలని దేశం సిద్ధంగా ఉందని మంత్రి ప్రకటించారు.

దేశవ్యాప్తంగా 455 జిల్లాల్లో కొనసాగుతున్న 100 రోజుల క్షయ ముక్త భారత్ ప్రచారం విస్తృతంగా జరుగుతోంది. ఈ ప్రచారంలో ఇప్పటి వరకు 5 లక్షల మంది రోగులను గుర్తించారు. 2025 చివరి నాటికి క్షయవ్యాధిని నిర్మూలించగలిగేలా అన్ని ఆకాంక్ష జిల్లాలు, ఆకాంక్ష మండలాలను ఈ ప్రచారం కిందకు చేర్చనున్నట్లు మంత్రి ప్రకటించారు. పర్యావరణంపై ప్రతికూల ప్రభావం కారణంగా అంటువ్యాధులు కాని వ్యాధులు విపరీతంగా పెరగడంపై కేంద్ర మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో వైద్యుల కొరతని అంగీకరించిన మంత్రి టెలి మెడిసిన్ వ్యవస్థతో ఈ సమస్యను అధిగమించడం పరిష్కారమని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

డ్రోన్ సేవలు

చక్కని రవాణా సౌకర్యాలు, ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ అందుబాటులో లేని మారు మూల ప్రాంతాలకు ఆరోగ్య సంరక్షణ సేవల్ని సకాలంలో అందజేసేందుకు డ్రోన్ సేవను ప్రవేశపెట్టారు. ఈ వ్యవస్థని కొండలు, మారుమూల ప్రాంతాలకు మరింత విస్తరించనున్నారు.

ఉన్నత ఆరోగ్య సేవలకు కట్టుబడి ఉన్నాం: ముఖ్యమంత్రి

రాష్ట్ర ప్రజలకు ఉన్నతమైన ఆరోగ్య సేవలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ప్రసంగంలో పేర్కొన్నారు. రాష్ట్రంలో త్వరలో 5 వేల ఖాళీ వైద్యుల పదవుల్ని భర్తీ చేయనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. ఇటీవల 3,537 మంది ఆరోగ్య సిబ్బందిని నియమించారు. సమీప భవిష్యత్‌లో మరో 5000 మంది వైద్యుల్ని నియమించి ఖాళీలను భర్తీ కార్యాచరణ ప్రణాళిక ఖరారు అయినట్లు తెలిపారు.

వైద్య విద్యా సంస్థల ఏర్పాటు

రాష్ట్రంలో ఆరోగ్య సంరక్షణ విద్యా వ్యవస్థ బలోపేతం సంకల్పంతో త్వరలో 8 కొత్త నర్సింగ్ కాలేజీలను ప్రారంభించనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. రానున్న విద్యా సంవత్సరం 2025–26లో ఫుల్బాణి మరియు అంగుల్‌లో త్వరలో రెండు కొత్త వైద్య కళాశాలలు ప్రారంభిస్తారు. రాష్ట్రంలో మరో 4 దంత వైద్య కళాశాలలు ప్రారంభం అవుతాయని పేర్కొన్నారు. జాతీయ ఆరోగ్య మిషన్ కింద ఆయుష్మాన్ మందిరాల నిర్మాణం కారణంగా దేశంలోని ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థ మరింత మెరుగుపడింది. రాష్ట్రంలో 7,358 పట్టణ, గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీ) మరియు సబ్ సెంటర్లని ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలుగా మారుస్తామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో రానున్న ఆర్థిక సంవత్సరంలో 1,338 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలకు కొత్త భవనాలు నిర్మించనున్నట్లు ఆయన తెలియజేశారు.

పోలవరానికి వ్యతిరేకంగా ఆందోళన


పోలవరం ప్రాజెక్టుకు వ్యతిరేకంగా నిరసనలో పాల్గొన్న నేతలు


సభకు హాజరైన మూడు రాష్ట్రాల ప్రజలు


నది నీటితో మహిళల నిరసన

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి మోటు తాహశ్లీ ప్రాంతంలో శుక్రవారం పోలవరం ప్రాజెక్టుకు వ్యతిరేకంగా మల్కన్‌గిరి బీజేడీ నేతలతో పాటు మూడు రాష్ట్రాల ప్రజలు ఆందోళన చేపట్టారు. పోలవరం పూర్తయితే మల్కన్‌గిరి జిల్లాలో మోటు ప్రాంతంలో ఉన్న 12 పంచాయతీల ప్రజలు నిలువ నీడ లేకుండాపోతారని బీజేడీ మాజీ ఎంపీ రమేశ్ మాఝి అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఏకపక్ష నిర్ణయాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. మోటు వద్ద ఉన్న సీలేరుకు ఆనుకుని ఉన్న ప్రాంతాలు, చత్తీస్‌గఢ్‌లోని కొన్ని గ్రామాలు పూర్తిగా నీటమునిగిపోతాయని తెలిపారు. గిరిజనులకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోబోమని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ ప్రదీప్ మాఝి, మల్కన్‌గిరి మాజీ ఎమ్మెల్యే మనాస్ మడ్కమి, బోజబోక్సి పాత్రో, మాజీ ఎంపీ జిన్దా హికాకా, ఎమ్మెల్యే రొబినందో, మున్న ఖాన్, ఈశ్వర్ చంద్ర పాణిగ్రహి, దేబి మిశ్రో , పద్మిణీ దయిన్, రోనాహరి తదితరులు పాల్గొన్నారు.

డోలీ యాతన


డోలీలో మహిళను మోస్తున్న భర్త, గ్రామస్తులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ సమితి నూవగూఢ పంచాయతీ బడపూట్ గ్రామంలో నివాసం ఉంటున్న సబితా సీస అనే మహిళ శుక్రవారం తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. గ్రామస్తులు 108కు ఫోన్ చేయడంతో ఆ ఊరికి బండి రాలేకపోయింది. దీంతో భర్తతో పాటు గ్రామస్తులే డోలీ కట్టి ఐదు కిలోమీటర్ల పాటు మోసుకుంటూ తీసుకువచ్చారు. ఇరగూప వద్దకు అంబులెన్స్ రావడంతో వాహనంలోకి ఎక్కించి చిత్రకొండ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యులు ఆమెకు మలేరియా సోకినట్లు నిర్ధారించారు.

వ్యాపారి ఇంట్లో భారీ చోరీ

- నగదు, నగలు అపహరణ


చోరీ జరిగిన అలమరా వద్ద ధిరెన్ సాహు భార్య

జయపురం: జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడ సమితి బెరగాం మఝిగుడ గ్రామంలో శుక్రవారం ఓ వ్యాపారి ఇంట్లో చోరీ జరిగింది. లక్షలాది రూపాయల విలువైన బంగారు నగలు, డబ్బు దొంగిలించుకు పోయినట్లు ఫిర్యాదు అందినట్టు పోలీసులు తెలిపారు. బెరగాం మఝిగుడ గ్రామంలో ధిరెన్ సాహు బట్టల వ్యాపారం చేస్తుంటారు. శివరాత్రి ఉత్సవాల సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి దసమంతపూర్ వెళ్లారు. అతని భార్య శుక్రవారం సాయంత్రం ఇంటికిరాగా బీరువ తెరచి ఉండటాన్ని గమనించారు. వెంటనే తన భర్త ధిరెన్ కు ఫోన్ చేసి ఎందుకు అలమరా తలుపులు తీసి ఉంచారని ప్రశ్నించారు. తాను తీయలేదని చెప్పి ఆగమేఘాలపై అతను కూడా ఇంటికి చేరుకున్నారు. ఇంటిని పరిశీలించగా వెనుక వైపు తలుపు విరిగి పడి ఉంది. అక్కడ బంగారు నగలు ఉంచిన డబ్బా కూడా పడిపోయి ఉండడంతో చోరీ జరిగినట్టు గుర్తించారు. అలమర్ లాకర్ తెరిచి చూడగా అది ఖాళీగా ఉంది. అందులో మూడు లక్షల రూపాయల నగదుతో పాటు బంగారు నగలు కనిపించలేదు. అదే ఇంట్లో కుమారుడు ఉంటున్న గదికి వెళ్లి చూడగా అందులో రూ. 40 వేలు కనిపించలేదు. దొంగలు మొత్తం రూ. 3 లక్షల 40 వేలు, 60 గ్రాముల బంగారు నగలు దొంగిలించినట్లు వారు బొయిపరిగుడ పోలీసులకు ఫిర్యాదు చేశారు పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు. కొరాపుట్ నుంచి సైంటిఫిక్ టీమ్‌తో పాటు జాగిలాన్ని రప్పించి చేస్తున్నారు.

సైకత నివాళి



ఉత్తమ మహంతి సహృదయుడు. ఆయన మరణంతో ఒడియా చలన చిత్ర రంగం మసకబారి పోయిందని అంతర్జాతీయ సైకత శిల్పి సుదర్శన్ పట్నాయక్ సంతాపం ప్రకటించారు. ఆయన మృతి పట్ల సంతాప సూచనగా హృదొయె రే ఉత్తమ్ నినాదంతో అపురూప సైకత శిల్పం ఆవిష్కరించాడు. పూరీ సాగర తీరంలో ఈ శిల్పం పర్యాటకులు, సందర్శకుల్ని విశేషంగా ఆకట్టుకుంది.

– భువనేశ్వర్/పూరీ

శ్రీ జగన్నాథుడిని దర్శించుకున్న నడ్డా


కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా శుక్ర వారం పూరీ శ్రీ మందిరంలో రత్న వేదికపై కొలువు దీరిన బలభద్రుడు, దేవీ సుభద్ర మరియు శ్రీ జగన్నాథుని దర్శించుకున్నారు. రాష్ట్ర పర్యటనలో భాగంగా ఆయన శ్రీ మందిరం సందర్శించారు. – భువనేశ్వర్

ఆపరేషన్లకు 31 మంది ఎంపిక


శిబిరాన్ని ప్రారంభిస్తున్న చేస్తున్న డాక్టర్ బలియార్ బాబు


శిశువులకు శస్త్ర చికిత్స చేస్తున్న డాక్టర్లు


స్క్రీనింగ్ కోసం క్యూకట్టిన తల్లిదండ్రులు

జయపురం: జయపురం జిల్లా కేంద్రాస్పత్రిలో శుక్రవారం దివ్యాంగులకు శస్త్రచికిత్స శిబిరం నిర్వహించారు. ఒడిశా ప్రభుత్వ సామాజిక సురక్షా, వికలాంగ ఆపరేషన్ విభాగం ద్వారా రాష్ట్రీయ శిశు ఆరోగ్యం, శిశు వికాస విభాగం, జిల్లా అధికార యంత్రాంగం సంయుక్తంగా నిర్వహించిన ఈ శిబిరం మూడు రోజుల పాటు కొనసాగనుంది. శిబిరాన్ని డాక్టర్ బలియార్ బాబు ప్రారంభించారు. ఆయన ప్రసంగిస్తూ పాదాలు వక్రంగా ఉన్న వారికి శస్త్ర చికిత్సలు చేసేందుకు నిర్వహించిన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైకల్యం ఉందని చింతించనక్కర్లేదని, ఆధునిక శస్త్ర చికిత్స పద్ధతులు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. శిబిరంలో మల్కనగిరి, నవరంగపూర్, కొరాపుట్ జిల్లాల నుంచి 51 మంది వచ్చారని నిర్వాహకులు తెలిపారు. దాదాపు 38 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు డాక్టర్ కిశోర్ చంద్ర మహాపాత్రో వెల్లడించారు. శిబిరంలో డాక్టర్ పవిత్ర కుమార్ సాహు, డాక్టర్ కె.సత్యనారాయణ రావు, డాక్టర్ పి.కె.పారిడ, డాక్టర్ సంతోష్ పరియరథ్ లతో పాటు ఇతిశ్రీ సామంతరాయ్, దుర్గా రామ్, మొర్షి దిగాల్, సంజయ కుమార్ సాహు, శుషమ దొలాయ్, జిల్లా కేంద్ర హాస్పిటల్ మేనేజర్ శ్రీమతి రూపసి మధుమతి నాయిక్, తథాగత దాదస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ లాంఛనాలతో ఉత్తమ మహంతి అంత్యక్రియలు


ఉత్తమ మహంతి


ఉత్తమ మహంతి పార్థివ దేహానికి పుష్పాంజలితో నివాళులర్పించిన ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి


శ్మశాన వాటికలో ప్రభుత్వ లాంఛనాలు


బాధిత కుటుంబీకుల్ని ఓదార్చిన ముఖ్యమంత్రి

భువనేశ్వర్: ప్రముఖ ఒడియా చలన చిత్ర నటుడు ఉత్తమ మహంతి (66) గురువారం రాత్రి కన్ను మూశారు. ప్రభుత్వ లాంచనాలతో ఆయన అంత్యక్రియలు శుక్రవారం నిర్వహించారు. స్థానిక సత్య నగర్ శ్మశాన వాటికలో ఆయన కుమారుడు, నటుడు బాబూ సాన్ అంత్యక్రియలు నిర్వహించారు. అభిమానులు, నాయకులు, శ్రేయోభిలాషులు, సినీ పరిశ్రమకు చెందిన నటీనటులు, ప్రముఖులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. దీర్ఘకాలిక అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆయన తుదిశ్వాస విడిచారు. ఫిబ్రవరి 8 నుంచి గురుగాంవ్ మేదాంత ఆస్పత్రిలో కాలేయ వ్యాధికి చికిత్స పొందుతూ కన్ను మూశారు.

వెండి తెరపై బహుముఖ పాత్రలకు ప్రాణం పోసిన ఉత్తమ మహంతి 135 కి పైగా ఒడియా చిత్రాలు, అనేక బెంగాలీ, హిందీ చిత్రాలలో నటించారు. ఆయన మృతిపై భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి, ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ఉప ముఖ్యమంత్రులు కనక వర్ధన్ సింగ్ దేవ్, ప్రభాతి పరిడా సహా పలువురు ప్రముఖులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి దివంగత నటుని నివాసం ప్రత్యక్షంగా సందర్శించి పుష్పగుచ్ఛాలు అర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దుఃఖంలో మునిగిన కుటుంబీకుల్ని ఓదార్చారు. దొండా బాలుంగా, భక్త సాల్‌బేగ్, ఫులోచొందొనొ, నిజుమ్ రాతీరొ సాథి, ఝియొటి సీతా పారి, రజనీగంధ, చొక్కా భౌన్రీ, జొగ్గా హత్తారే పఘు, మమతా మాగే మూలొ , సమయ్ బొడొ బలబాన్, సొంఖొ సింధూరొ, సాహారి బఘు, ఎయి అమొ సొంసార్, జోర్ జార్ ముల్క్ తారొ, దొయిబా దొవుడి, పొలాతక్, ఉద్దండి సీత వంటి పలు ప్రేక్షక ఆదరణ చిత్రాలలో అద్భుత నటనతో విశేష ప్రేక్షక ఆదరణ నోచుకున్నారు.

8 నుంచి బోడజాతర


ఘటాలతో అర్చకులు


అమ్మవారి ఆహ్వానానికి బయలుదేరిన పల్లకి

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లాలో ఈ నెల ఎనిమిది నుంచి 11వ తేదీ వరకు బోడజాతర వైభవంగా జరగనుంది. ఇందులో భాగంగా గురువారం రాత్రి స్థానిక మౌళిమ మందిరం నుంచి అమ్మవారి పిలుపునకు భక్తులు బయలుదేరారు. భారీ ఊరేగింపుతో ఆంధ్రా–ఒడిశా సరిహద్దున ఉన్న పొల్లేరు గ్రామంలో కొలువు దీరిన ముత్యాలమ్మతో పాటు కన్నంరాజ్ (శ్రీకృష్ణుడు), బాల్‌రాజ్ (అర్జునుడు), పోతూరాజ్ (భీముడు)లను ఉత్సవంలో కీలకం కావడంతో వారిని ఆహ్వానించేందుకు భారీగా భక్తులు సంప్రదాయబద్ధంగా వెళ్లారు. అనంతరం కలిమెల సమితి మాన్యంకొండ గ్రామం తాడక రేవు నుంచి పడవ అమ్మవారిని జిల్లాలోకి ఆహ్వానించారు. భక్తులతో ఎనిమిదో తేదీన మల్కన్‌గిరికి చేరుకొని 11వ తేదీ వరకూ ఉత్సవాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించనున్నారు. ఆంధ్రా, ఒడిశా, చత్తీస్‌గఢ్ నుంచి భక్తులు పాల్గొంటారు.

విజిలెన్స్ వలలో సహకార బ్యాంక్ ఉద్యోగి


సోదాలు జరుపుతున్న విజిలెన్స్ అధికారులు


విజిలెన్స్‌కి చిక్కిన సత్యన్నారాయణ చలాన్

కొరాపుట్: విజిలెన్స్ వలలో సహకార బ్యాంక్ ఉద్యోగి చిక్కారు. శుక్రవారం కొరాపుట్ జిల్లా సిమిలిగుడ సమితి కుందిలి ల్యాంప్స్ సహకార బ్యాంక్ ఉద్యోగి సత్యన్నారాయణ చలాన్ పట్టుబడ్డారు. ఒక మిలెట్స్ పంటలు పండించిన రైతుకి డబ్బులు చెల్లించడానికి మూడు వేల రూపాయలు లంచం డిమాండ్ చేశారు. దాంతో రైతు విజిలెన్స్ అధికారులు ఆశ్రయించారు. వెంటనే విజిలెన్స్ విభాగం ఆ డబ్బుని రైతుకి అందించి వాటిని సత్యన్నారాయణకి అందజేయమని చెప్పారు. వెంటనే రైతు ఆ డబ్బుని సత్యన్నారాయణకి అందజేయగా అప్పటికే మాటు వేసిన అధికారులు రెడ్ హ్యాండ్‌గా పట్టుకున్నారు. నిందితుని కార్యాలయం, అతని నివాసాలపై ఏకకాలంలో దాడులు నిర్వహించారు.